గురు వారం
23-11-2023
సంపుటి - 08,
సంచిక - 395
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh

CEO & Editor : G. PRUDHVIRAJ

RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు వార్త పత్రిక

❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole


## అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్

### చౌటుప్పల్ సభలో కెటిఆర్ హామీ



- ఆలోచించే ప్రతి ఒక్కరి ఓటు గులాబీ పార్టీకే
- అన్ని వర్గాల వారు బీఆర్ఎస్ వైపు ఉన్నారు
- కాంగ్రెస్ హవా అనేది కేవలం అపోహ మాత్రమే
- యువతకు బీఆర్ఎస్ పట్ల పూర్తి విశ్వాసం
- విజయం సాధించిన వెంటనే ఉద్యోగాల భర్తీ
- జాబ్ క్యాలెండర్‌పై దృష్టి సారిస్తాం
- 80కి పైగా సీట్లతో మళ్లీ అధికారంలోకి బీఆర్ఎస్
- మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిలో కేటీఆర్

**భువనగిరి, నవంబర్ 22 (సమ సమాజం):** ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత జాబ్ క్యాలెండర్‌పై దృష్టి పెడుతామని మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ప్రకటించారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మునుగోడు దుస్థితికి కారణమైన కాంగ్రెస్‌పై మండిపడ్డారు. 60 ఏళ్ల పాటు మునుగోడు ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది ఎవరి ప్రశ్నించారు. గతంలో

4వ పేజీలో...

## బిజెపికి మరో షాక్



కాంగ్రెస్‌లో చేరిన నటి దివ్యవాణి

**హైదరాబాద్, నవంబర్ 22 (సమ సమాజం):** ఎన్నికలు సమీపిస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీలో మరింత చేరికల జోష్ పెరిగింది. బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఒక్కొక్కరూ బిజెపిలో చేరితే ఇప్పుడు కట్టకట్టుకుని వారంతా పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే విజయశాంతి వంటి సీనియర్ నేతలు కాంగ్రెస్‌లో చేరగా తాజాగా ప్రముఖ నటి దివ్యవాణి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. బుధవారం ఉదయం ఏఐసీసీ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే సమక్షంలో ఆమె కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికల ముందు చేరికలు పెరగడంతో కాంగ్రెస్ నేతల్లో కొత్త జోష్ నింపింది. మొన్న విజయశాంతి.. నేడు దివ్యవాణి కాంగ్రెస్‌లో చేరడంతో పార్టీకి సినీ గ్లామర్ వచ్చి చేరుతోందని హస్తం శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.కాంగ్రెస్‌లో చేరిక తర్వాత దివ్యావాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన పోరాడుతోందన్నారు. ప్రజల కోసం ఆలోచించే ఏకైక పార్టీ కాంగ్రెస్ అని అందుకే పార్టీలో చేరినట్లు తెలిపారు. తనకు పదవి ఇచ్చినా.. ఇవ్వకపోయినా.. ఎలాంటి బాధ్యత ఇచ్చినా సక్రమంగా నిర్వర్తిస్తానని, కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని దివ్యవాణి చెప్పారు.

## కాంగ్రెస్ పాలనలో తాండూరు అధ్వాన్నం

### ఇప్పుడేమో అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచింది

- 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం
- మంచినీరు, కరెంట్‌కు ఢోకా లేకుండా చేశాం
- తాండూరు సభలో సిఎం కెసిఆర్ వెల్లడి
- రేవంత్ నమ్ముకుంటే ఆగంకాక తప్పదు
- కామారెడ్డి, కొడంగల్ లో తుక్కుగా ఓడించాలి
- రేవంత్, కాంగ్రెస్‌లను ఓడిస్తేనే దరిద్రం పోతది
- కొడంగల్ సభలో సిఎం కెసిఆర్ విమర్శలు
- ప్రజల చేతిలో విలువైన ఆయుధం ఓటు
- కాంగ్రెస్ పార్టీ 58 ఏళ్లు గోస పెట్టింది
- ఆర్ఎస్ పార్టీ పుట్టిందే తెలంగాణ కోసమే
- మహబూబ్‌నగర్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్



**తాండూరు, నవంబర్ 22 (సమ సమాజం):** కాంగ్రెస్ పాలనలో తాండూరు వెనుకబడిన ప్రాంతం కాగా...ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా పోయిందని సిఎం కెసిఆర్ అన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపామని అన్నారు. రోడ్లు బాగు చేసుకున్నాం. చెక్ డ్యాంలు కట్టుకున్నాం. మైనర్ ఇరిగేషన్ కింద ఎన్నో చెరువులు మంచిగా చేసుకున్నాం. భూగర్భ జలాలు పెరిగాయి. ఇదంతా మీ కండ్ల ముందే ఉంది. నేనేక్కడిదో అమెరికా కథ చెప్పట్లేదు. మీ తాండూరు కథనే చెప్తున్నా అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని, పైలట్ రోహిత్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. ఈ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం జరిగింది. 50 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఏం జరిగిందో పోల్చిచూడాలన్నారు. ఉన్న తెలంగాణను ఊడగొట్టిందే కాంగ్రెస్. కనీసం మంచినీళ్లు, సాగునీళ్లు ఇవ్వలేదు. తాండూరు ప్రజలు కాగ్నా నది వద్ద గుంతలు తీసి వడకట్టుకొని నీళ్లు తాగేది కాంగ్రెస్ రాజ్యంలో. కానీ ఈ రోజు మిషన్ భగీరథతో ప్రతి తండాలో, చిన్న ఊరులో కూడా పరిశుద్ధమైన నీరును సరఫరా చేస్తోంది. మంచినీళ్లు కూడా ఇవ్వలేదు కాంగ్రెస్ పాలనలో. పదేండ్ల కాలంలో మారుమూల తండాలకు మంచి నీళ్లు తెచ్చి ఇచ్చాం అని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ వచ్చిన కొత్తలో కరెంట్ లేదు, సాగు, మంచినీళ్లు లేవు. ప్రజలంతా బతుకపోవుడు. అర్ధరాత్రి కరెంట్ కోసం పోయి తాండూరులో 40 మంది రైతులు షాకులతో, పాములు కరిచి చనిపోయారు. ఇవన్నీ మీరు ఆలోచించాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత

4వ పేజీలో...

## మానవసేవే మాధవ సేవగా నమ్మిన సత్యసాయి

### మానవతా విలువలకు కట్టుబడి పనిచేసిన సాయి

### డీమ్డ్ వర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్రపతి ముర్ము



**పుట్టపర్తి, నవంబర్ 22 (సమ సమాజం):** మానవసేవే మాధవసేవ అని బోధించిన శ్రీ సత్య సాయి సేవలు అందరికీ ఆదర్శనీయమని భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పేర్కొన్నారు.బుధవారం ప్రశాంతి నిలయంలోని సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ లో శ్రీ సత్య సాయి బాబా యూనివర్సిటీ 42 వ స్నాతకోత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిధి గా హాజరవ్వగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ గౌరవ అతిధి గా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో శ్రీసత్య సాయి ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైయర్ లర్నింగ్ (ఎస్.ఎస్.ఎస్. ఐ.హెచ్ ఎల్) ఛాన్స్.లర్ కే చక్రవర్తి రిటైర్ ఐఏఎస్, వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ బి రాఘవేంద్ర ప్రసాద్,రాష్ట్ర మహిళా, పిల్లలు, వికలాంగులు మరియు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ మంత్రి కె.వి ఉష శ్రీ చరణ్, సత్యసాయి సెంటర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు ఎస్ ఎస్ నాగానంద్ , తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ... పుట్టపర్తిలో శ్రీసత్యసాయి 98వ జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.నేడు భగవాన్ సత్య సాయి బాబా సమాధిని దర్శించే సౌభాగ్యం కలిగిందన్నారు. ప్రశాంతి అనగా ఆధ్యాత్మిక శాంతి అని అన్నారు. సదా సత్యం పలకాలని, సదా ధర్మాన్ని ఆచరించాలన్న బాబా వాక్కులను నిజ జీవితంలో అలవరుచుకొని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. భగవాన్ సత్యసాయిబాబా తాను బోధించిన మానవతా విలువలు, ఆధ్యాత్మికత కలగలిపి ఆధునిక విజ్ఞానాన్ని అందించేందుకు చక్కటి విద్యా వ్యవస్థను నెలకొల్పారన్నారు. మనమందరం ఆధ్యాత్మిక చింతన ,కరుణ,పరోపకారం కలిగి సత్యసాయిబాబా అడుగుజాడల్లో నడవాలన్నారు. సత్యసాయి భారతీయ విద్యావిధానంలో అనాదిగా అమలవుతున్న గురుకుల విద్యా విధానానికి మెరుగులుదిద్దుతూ, నేటి సమాజ అవసరాల మేరకు మార్పులు చేసి నూతన గురుకుల విధానాన్ని

4వ పేజీలో...

## చరిత్ర సృష్టించే అవకాశం ఇక్కడి ప్రజలది

### కెసిఆర్‌ను ఓడిస్తే దేశమంతా ఇటే చూపు ● నిజామాబాద్ ప్రచారంలో రేవంత్ పిలుపు



**నిజామాబాద్, నవంబర్ 22 (సమ సమాజం):** సీఎం కేసీఆర్ రాసిపెట్టుకో కాంగ్రెస్ పార్టీకి 80 సీట్ల కంటే ఒక్క సీటు తగ్గదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పదేళ్లపాటు కుటుంబం అంతా కలసి దోచుకుందని అన్నారు. వారికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కెసిఆర్‌ను ఓడించడం ద్వారా నిజామాబాద్ ప్రజలు చరిత్ర సృష్టించాలన్నారు. బుధవారం నాడు ఉమ్మడి జిల్లాలో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి నిజామాబాద్‌జిల్లాలో మాట్లాడుతూ...'డిసెంబర్ 3వ తేదీన లెక్క చూసుకో కేసీఆర్.. 80 కంటే ఒక్కటి తక్కువున్నా ఏ

4వ పేజీలో...

## బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతుల పాలిట శత్రువులు

### స్వామినాథన్ కమిషన్ నివేదిక బుట్టదాఖలు

- మోటర్లకు మీటర్లు పెట్టాలన్నది బిజెపి పాలసీ
- కాంగ్రెస్‌ను గెలిపించినా మోటర్లకు మీటర్లు తప్పవు
- మీడియా సమావేశంలో హరీష్ రావు విమర్శలు
- అధికారంలోకి వచ్చాక అసైన్డ్ భూములకు హక్కులు
- దుబ్బాక ప్రచారంలో మంత్రి హరీష్ హామీ



**సిద్దిపేట, నవంబర్ 22 (సమ సమాజం):** బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతుల పాలిట శత్రువులని మంత్రి హరీశ్‌రావు అన్నారు. రైతులకు మంచి జరగాలనే ఉద్దేశంతో వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ యూపీఏ హయాంలో కేంద్రానికి ఒక నివేదిక సమర్పించారని, కాంగ్రెస్ గానీ, బీజేపీ గానీ ఆ

4వ పేజీలో...

## కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు నెలలకో సీఎం

## బీసీని ముఖ్యమంత్రిని చేస్తాం

- ప్రకటించే దమ్ము కాంగ్రెస్ కు ఉందా
- కేటీఆర్ సీఎం అవుతాడని కేసీఆర్ కలలు కంటున్నారు
- డబుల్ ఇంజిన్ సర్కారుతోనే తెలంగాణ అభివృద్ధి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 22 (సమ సమాజం):** రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో మరింత జోరుగా చేయనున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తెలిపారు. రాష్టంలో బీజేపీ అభ్యర్థుల తరుపున ప్రచారం చేసేందుకు జాతీయ నాయకులు రాష్ట్రానికి రానున్నారని.. వారు పాల్గొనే బహిరంగ సభల వివరాలను వెల్లడించారు. అనంతరం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలపై పలు విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని మరింత ఉధృతం చేస్తామని.. ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, జేపీ నడ్డా, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్ ప్రచారంలో

4వ పేజీలో...

# ఎన్నికల వేళ ఐటి దాడుల కలకలం




హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల సమయం సమీపిస్తున్న తరుణంలో ఐటి దాడులు కలకలం సృష్టి స్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన పార్టీల అభ్యర్థులపై ఐటి అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రతిపక్ష కాంగ్రెస్ అభ్యర్థులపై దాడులు జరుగుతున్నాయి. ఇటీవలే పొంగులేటి శ్రీ నివాస్ ఇంట్లో ఐటీ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. తాజాగా చెన్నూరు కాం గ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ వివేక్ వెంకటస్వామి ఇల్లు, కార్యాలయాల్లో ఐటి అధికారులు సోదాలు ని ర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్‌లోని సోమాజిగూడ, మంచిర్యాల లోని ఆయన నివాసాల్లో అధికారులు తనిఖీలు జరిపారు. బేగంపేటలోని వివేక్ కార్యాలయంలనూ సోదాలు చేశారు. అయితే సోమాజిగూడలోని వివేక్ వెంకటస్వామి ఇంట్లో నాలుగున్నర గంటల పా టు సోదాలు సాగాయి. బ్యాంక్ ఖాతాలో రెండ్రోజుల క్రితం చేసిన నగదు బదిలీకి సంబంధించిన పత్రాలు పరిశీలించినట్టు సమాచారం. ఇక, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్‌లో ఏక కాలంలో వ్యాపారస్థుల ఇళ్లల్లో ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల నేప థ్యంలో పార్టీలకు అనుబంధంగా ఉన్న వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని వారి ఇళ్లల్లో ఐటి సోదా లు జరుగుతున్నాయి. ఆసిఫాబాద్‌లోని రితిక్ జివానీ ఇంట్లో స్థానిక పోలీసులతో కలిసి వారి బ్యాం కుకు సంబంధించిన వ్యాపార లావాదేవీలను పరిశీలించారు. అలాగే, కాగజ్‌నగర్‌లోని మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్ ఇంట్లో స్థానిక పోలీసులతో కలిసి ఐటి అధికారులు వారి లావాదేవీల ను పరిశీలించారు. ఆసిఫాబాద్‌లోని రితిక్ జివానీ ఇంట్లో కొంత నగదు దొరికినట్లు సమాచారం. ఈ నగదుపై అఇకారులు ఆరా తీశారు. అలాగే, వారి కుటుంబ సభ్యుల బ్యాంకు లావాదేవీలు, వ్యాపార లావాదేవీలను కూడా పరిశీలించారు. ఐటి అధికారులు జిల్లాకు సుమారుగా 20 వాహనాలలో వచ్చిన ట్టు తెలుస్తోంది. ఐటి అధికారులు చేస్తున్న దాడులతో ఆసిఫాబాద్ జిల్లాలోని బడా వ్యాపారస్థులు, కాంట్రాక్టర్ల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఐటి అధికారులు దా డులు నిర్వహించారు. జమ్మికుంటకు చెందిన ఆదిత్య కాటన్ ఇండస్ట్రీస్‌తో పాటు మరో కాటన్ మిల్లు యజమానులు ముక్క నారాయణ, ముక్క శివన్న ఇళ్లల్లో సోదాలు చేశారు. అన్ని క్షుణ్ణంగా పరిశీలిం చారు. తాండూరు మండలంలోని రేపల్లేవాడ సమీపంలోని జిన్నింగ్ మిల్లులో ఐటి శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఐటీ అధికారులు స్థానిక పోలీసు బందోబస్తుతో ఈ తనిఖీలు చేపట్టారు. మాజీ ఎంపీ వివేక్ మొన్నటివరకు బీజేపీలో ఉన్నారు. ఇటీవలే కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. అప్పటివరకు జరగని దాడులు పార్టీ మారిన తరువాతే జరగుతుండడంతో కావాలనే చేస్తున్నారన్న మాటలు వినిపిస్తున్నాయ. హుజురాబాద్, మునుగోడు ఎన్నికలకు వందల కోట్లు ఇచ్చింది వివేక్ కం పనీనే అని వినవస్తోంది. మంచిర్యాలలో 8 కోట్లు పట్టుకున్నవి వివేక్ సొమ్మే అని సమాచారం. ఈ డ బ్బుల విషయంలోనే ఈటలతో వివేక్ కి చెడిందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు పార్టీ మారగానే వివేక్‌ని టార్గెట్ చేశారనే వాదన వినిపిస్తోంది. ఈ నెల 15న.. వివేక్‌కు సంబంధించిన కంపెనీ ఉద్యో గులు చెన్నూరుకు 50 లక్షలు తరలిస్తూ హైదరాబాద్ రామంతాపూర్‌లో పట్టుబడ్డారు. ఇక.. వివేక్‌కు సంబంధించిన కంపెనీ నుంచి 8కోట్ల రూపాయల నగదు బదిలీపై కూడా కేసు నమోదు చేసిన ఇడి తనిఖీలు చేపడుతోంది. ఆన్‌లైన్ లావాదేవీలు భారీగా జరిగినట్టు గుర్తించింది. హైదరాబాద్‌లో 8కోట్ల రూపాయలను ఆర్‌టిజిఎస్ ద్వారా బదిలీ చేసినట్టు బీఆర్ఎస్ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో విచారణ మొదలుపెట్టిన పోలీసులు విశాఖ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, బేగంపేట్‌లోని హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఖాతా నుంచి ట్రాన్స్‌ఫర్ చేసిన రూ.8 కోట్ల రూపా యలను సైఫాబాద్ పోలీసులు ఫ్రీజ్ చేశారు. దీనికి సంబంధించి ఇడి, ఐటీ అధికారులు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం తెల్లవారుజాము నుంచి వివేక్ ఇళ్లు, ఆఫీసుల్లో ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ నెల 13న ఉదయం 10గంటల 57నిమిషాలకు బేగంపేటలోని హెచ్‌డి ఎఫ్‌సి బ్రాంచ్‌లో ఉన్న విశాఖ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఒక ఖాతా నుంచి బషీర్‌బాగ్ లోని ఐడిబిఐ బ్యాంకు శాఖలోని విజిలెన్స్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఖాతాలోకి రూ.8 కోట్ల రూపాయల నగదు బదిలీ అయినట్టు ఇడి అధికారులు గుర్తించారు. మంగళవారం తెల్లవారు జామున ఐదు గంటల నుంచి సోదాలు నిర్వహించారు. వివేక్ వెంకటస్వామి సూటు బూటు సూట్‌కే సులతో వచ్చి ఇతర పార్టీ నేతలను కొనుగోలు చేస్తున్నారని బిఆర్ఎస్ నేత బాల్కసుమన్ ఆరోపిం చారు. అంతేకాదు ఎన్నికల్లో డబ్బులు పంచేందుకు కూడా ప్రయత్నిస్తున్నారని ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేశారు. బిఆర్ఎస్ నేతల ఫిర్యాదుతో ఎన్నికల కమిషన్ రంగంలోకి దిగింది. వివేక్ కం పెనీకి సంబంధించిన ఉద్యోగులు డబ్బులతో పట్టుబడటం కూడా కలకలం రేపింది. దీంతో ఈడి, ఐటీ శాఖలకు సమాచారం ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఇడి, ఐటి అధికారులు రంగంలోకి దిగి దాడు లు చేస్తున్నట్టు సమాచారం. కాగా, వేక్ వెంకస్వామి ఇళ్లు, ఆఫీసులపై ఈడీ, ఐటీ దాడులను ఆయన అనుచరులు వ్యతిరేకిస్తు న్నారు. చెన్నూలులోని వివేక్ ఇంటి దగ్గరకు భారీగా చేరుకున్న కార్యకర్తలు, అనుచరులు ఆందోళన చేస్తున్నారు. ఇదంతా రాజకీయ కుట్ర అని ఇందులో బిఆర్ఎస్ హస్తం ఉందని వివేక అనుచరులను ఆరోపిస్తున్నారు. ఇటీవలే బీజేపీ నుంచి వివేక్ కాంగ్రెస్‌లో చేరారు. చెన్నూరు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్ నేతలపై ఐటి సోదాలను పిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితీవ్రంగా ఖండించారు. తమ పార్టీ నాయకుల ఇళ్లపై ఆదాయపన్ను శాఖ తనిఖీలు దేనికి సంకేతమని ప్రశ్నించారు. బిఆర్ ఎస్, బిజెపి నేతల ఇండ్లపై ఐటి సోదాలు ఎందుకు జరగడం లేదు? అని నిలదీశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సునామీ రాబోతోందని స్పష్టమైందని, ఆ సునామిని ఆపడానికి చేస్తున్న కుతంత్రమే ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## తమ నేతలపై కేసులు పెట్టడమే జగన్ లక్ష్యం

టిడిపి ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య వ్యాఖ్య



రాజమండ్రి, నవంబర్ 22 (సమ సమాజం): సీఐడీ వాళ్ళు తనకు నోటీసులు ఇచ్చినట్టు వైసీపీ ప్రచారం చేసిందని.. సీఐడీ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. జగన్ వ్యవస్థలను మేనేజ్ చేసి ప్రశ్నించే వారిని జైలులో పెడుతున్నారు. టిడిపి నేతలందరిపైనా కేసులు పెట్టే లక్ష్యంతో జగన్ పనిచేస్తున్నారని అన్నారు. అయితే జగన్ పనిపట్టేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు. జగన్ గ్యాంగ్ కోర్టు ధిక్కరణకు పాల్పడుతోందన్నారు. నిత్యం 144, 30 సెక్షన్లు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. జగన్ సీఐడీతో కలిసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు. తానెప్పుడు న్యాయ వ్యవస్థ పై వ్యతిరేకంగా మాట్లాడలేదన్నారు. ప్రతిపక్ష నేతలపై తప్పుడు కేసులు పెట్టి ఎన్నిరోజులు జైలులో పెడతారు? రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించే జగన్ రాష్ట్రానికి అవసరమా? జగన్ గ్యాంగ్ మేసే గ్యాంగ్.. దళితులపై దాడులు చేస్తోంది. రోజూ దళితులపై దాడి చేస్తోంది. ఆయన ఉద్దేశ్యం ప్రజలను భయపెట్టడం, జైలుకి పంపటం. యువగళం పాదయాత్ర ఈ నెల 24 నుంచి మళ్ళీ ప్రారంభమవుతుంది. మళ్ళీ ఎన్నికల్లో పోటీ చేసి గెలుస్తాను. అసెంబ్లీలో అడుగుపెడతాను' అని గోరంట్ల బుచ్చయ్య చౌదరి పేర్కొన్నారు.

# ఈ వారసులను నాన్నలు గెపిస్తారా!

తెలంగాణలో ఎన్నికల సమయం దగ్గర పడుతుంది. ఆరు రోజులే ప్రచారానికి గడువు ఉండటంతో అభ్యర్థులు రాత్రింబళ్లు ప్రచారంలో మునిగిపోయారు. ఈసారి విజయం సాధించే లక్ష్యంతో బరిలో నిలిచిన నేతలు. ఎత్తుకు పైఎత్తులు వేస్తూ విజయ బావుటా ఎగురవేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. అందులో భాగంగా ఈసారి ఎన్నికల్లో నాన్నల పేరు మీద టికెట్లు సంపాదించుకున్న యువ అభ్యర్థులు తండ్రుల ఫోటోలతో జపం చేస్తూ ప్రచార రథాలపై పరుగులు పెడుతూ గతంలో వారు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, పేదలకు ప్రభుత్వ పథకాలు అందించిన తీరును వివరిస్తున్నారు. తన తండ్రి అడుగుజాడల్లో నడిచి పేదల పక్షాన పోరాటం చేస్తానని పేర్కొంటూ ఈఎన్నికల్లో తనను గ్టటెక్కించాలని కోరుతున్నారు.ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల పోరులో కంటోన్మెంట్ నుంచి ప్రజా యుద్ద నౌక గద్దర్ కూతురు జి.వి.వెన్నెల కాంగ్రెస్ తరపున పోటీ చేస్తుంది. తన తండ్రి పేదల కోసం కాలుకు గ్జజెకట్టిన పాట పడుతూ ప్రజలను చైతన్యవంతం చేయడంలో కీలక పాత్ర పోషించి జీవితం ప్రజల కోసమే అర్పించాడని ప్రచారంలో పేర్కొంటుంది. తన తండ్రి ఆశయాలకు అనుగుణంగా పనిచేసి బడుగు, బలహీనవర్గాల అభివృద్ధికి పాటు పడుతానని చెబుతుంది. అదే నియోజకవర్గం నుంచి గ్రేటర్ హైదరాబాద్‌లో సీనియర్ నాయకుడు, ఐదుసార్లు అదే నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన జి. సాయన్న కూతురు లాస్య నందిత బిఆర్ఎస్ నుంచి బరిలో నిలిచి తండ్రి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పేరుతో ఓటర్ల వద్దకు వెళ్లుతూ తనకు ఈఎన్నికల్లో మద్దతు ఇచ్చి అసెంబ్లీలో అడుగు పెట్టేలా దీవించాలని వేడుకుంటుంది. గతంలో కార్పొరేటర్‌గా పనిచేయడంతో కొద్దిగా రాజకీయ అనుభవం ఉండటంతో ప్రజల ఆకట్టుకుంటుంది.వీరితో పాటు హైదరాబాద్‌లో పేదల నాయకుడిగా పేరుపొందిన పి. జనార్ధన్‌రెడ్డి(పిజెఆర్) కూతురు విజయారెడ్డి ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేస్తోంది. అదే నియోజకవర్గం నుంచి పిజెఆర్ ఐదు పర్యాయాలు విజయం సాధించిన రాజధాని నగరంలో ఆయన పేరు అంటే తెలియని వారు ఉండరు. ప్రస్తుతం ఆయన చేసిన పనులను ప్రజలకు వివరిస్తూ ఈసారి ప్రజలు తనను ఆదరించాలని కోరుతుంది. నారాయణపేట నియోజకవర్గం నుంచి చిటటెం పర్ణికారెడ్డి తన తాతా నర్సిరెడ్డి, తండ్రి వెంకటేశ్వర్‌రెడ్డి చేసిన సేవలు ప్రజలకు చెబుతూ ఈ ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలను అభ్యర్థిస్తున్నారు. ములుగు నియోజకవర్గం నుంచి బడే నాగజ్యోతి తన తండ్రి బడే నాగేశ్వర్‌రావు పేద ప్రజల కోసం పోరాట చేశాడని ఆయన ఆశయాలు నేరవేర్చేవిధంగా ప్రజలకు సేవలందిస్తానని పేర్కొంటూ ఎన్నికల్లో తానను దీవించాలని ప్రచారం చేస్తుంది.నాగార్జునసాగర్ నుంచి సీనియర్ నాయకుడు నోముల నర్సింహ్మయ్య తనయుడు నోముల భగత్‌కుమార్ కూడా రెండోసారి బరిలో ఉంటూ తన తండ్రి ప్రజలకు అందించిన విధంగా ప్రజాసేవ చేస్తానని ప్రచారంలో చేస్తూ తనను ప్రజలు మరోసారి చట్ట సభకు పంపే అవకాశం కల్పించాలని దండాలు పెడుతున్నారు. ములుగు నుంచి బిజెపి తరుపున మాజీ మంత్రి చందులాల్ తనయుడు ఆజ్మీరా ప్రహ్లాద్ కూడా పోటీ చేస్తూ తన తండ్రి నియోజకవర్గం అభివృద్ధికి పాటు పడ్డారని ఆయన బాటలో నడిచి పేదల కోసం నిరంతరం పాటు పడుతారని పేర్కొంటూ మొదటిసారి అసెంబ్లీ అడుగు పెట్టేలా చూడాలని కోరుతున్నారు.వీరితో పాటు తండ్రుల వృద్దాప్యంతో వారి స్థానంలో వేములవాడ నుంచి చేనమనేని విద్యాసాగర్ తనయుడు వికాస్‌రావు, కోరుట్ల నుంచి కల్వకుంట్ల విద్యాసాగర్ కూమారుడు సంజయ్, నాగర్‌కర్నూల్ నుంచి కూచకుళ్ల దామోదర్‌రెడ్డి తనయుడు రాజేష్‌రెడ్డి, మహబూబ్‌నగర్ మాజీ ఎంపి జితేందర్ రెడ్డి కుమారుడు మిథున్‌రెడ్డి, నాగార్జునసాగర్ నుంచి మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు జైవీర్‌రెడ్డి, మెదక్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నుంచి మైనంపల్లి హన్మంతరావు పుత్రుడు మైనంపల్లి రోహిత్‌రావు, శేరిలింగంపల్లి బిజెపి నుంచి ఎం. రవికుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీలో బలమైన నేతగా నాలుగు దశబ్దాల పాటు పనిచేసిన గడ్డం వెంకటస్వామి కుమారులు ఆశించిన స్థాయిలో రాజకీయాల్లో ఎదగలేకపోవడంతో ఈఎన్నికల్లో బెల్లంపల్లి నుంచి గడ్డం వినోద్, చెన్నూర్ నుంచి వివేక్ వెంకటస్వామి బరిలో నిలిచి తన తండ్రి చూపిన బాటలో నడిచి పేద ప్రజలకు జీవితాంతం సేవలందిస్తామని ప్రచారంలో వాగ్దానం చేస్తున్నారు.

# ప్రజల్లోకి వెళ్లేందుకు బాబు ప్లాన్

17ఎ కేసు తేలితే తప్ప ముందుకు సాగని వైనం

హైకోర్టు బెయిల్ ఇచ్చినా మరికొంత సమయం పట్టే ఛాన్స్



అమరావతి,నవంబర్ 22 (సమ సమాజం): చంద్రాబాబు ప్రజల్లోకి వెళ్లుందుకు ప్రణాళికులు రూపొందిస్తున్నారని సమాచారం. అయితే 17ఎ కేసులో తుదితీర్పు వస్తే తప్ప ఆయన కార్యాచరణ సాగేలా లేదు. మరోవైపు హైకోర్టు తీర్పుతో ఊరట దక్కినా అది తాత్కాలికమే అన్న వాదనలు ఉన్నాయి. న్యాయపరమైన వివాదాలన్నీ తేలిపోతే చంద్రబాబు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్లడానికి అటంకాలు ఏమీ ఉండవు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో రెండు, మూడు నెలల పాటు ప్రజల్లోకి వెళ్లకుండా ఉన్న సందర్భాలు దాదాపుగా లేవు. అరెస్టు అయిన సమయంలోనూ ఆయన రాజకీయ యాత్రలో ఉన్నారు. భవిష్యత్ కు భరోసా పేరుతో ఆయన పూర్తి స్థాయిలో యాత్రలు చేయడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మూడు నెలల సమయం వృధా అయినందున.. మరో నాలుగు నెలల్లో ఎన్నికలు ఉన్నందున ఇక చంద్రబాబు.. పర్యటనల్లోనే ఎక్కువ సమయం గడిపే అవకాశం ఉంది. జనసేన ను సమన్వయం చేసుకునేందుకు పూర్తి స్థాయిలో రాజకీయం చేసే అవకాశం ఉంది. స్కిల్ కేసులోనే అరెస్టు చేసినప్పుడే హైకోర్టులో క్వాష్ పిటిషన్ చంద్రబాబు దాఖలు చేశారు. అయితే 17ఏ చంద్రబాబుకు వర్తించదని హైకోర్టు తీర్పు చెప్పింది. ఏసీబీ చట్టంలోనే సెక్షన్ 17ఏ తెచ్చింది కుట్రపూరితంగా పెట్టే రాజకీయ వేధింపుల కేసుల నుంచి అంతకు ముందు పదవుల్లో ఉన్న వారికి రక్షణ కోసమేనని ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న రాజకీయాలు క్లియర్ కేస్‌గా రీజియమ్ రివెంజ్ అని చంద్రబాబు తరపు న్యాయవాదులు వాదించారు. కేసు వాదనల సమయంలో న్యాయమూర్తుల వ్యాఖ్యానాలు, గత తీర్పులను బట్టి చూస్తే చంద్రబాబుకు గట్టి రిలీఫ్ ఖాయమని టీడీపీ నేతలు నమ్ముతున్నారు. కానీ వాదనలు పూర్తయ్యాయి. తీర్పు రిజర్వ్ అయింది. తీర్పు ఎప్పటికప్పుడు వాయిదా పడుతుంది. దీపావళి సెలవుల తర్వాత ప్రకటిస్తామని బెంచ్ ప్రకటించింది. సైబర్ నెట్ కేసులో చంద్రబాబు ముందస్తు బెయిల్ పిటిషన్ పై విచారణ 30వ తేదీన జరగాల్సి ఉంది. ఈ లోపే తీర్పు వస్తుందని ఆశిస్తున్నారు. చంద్రబాబును ఎట్టి పరిస్థితుల్లోనూ జైల్లో ఉంచాలని వైఎస్‌ఆర్‌సీపీ వ్యూహకర్తలు గట్టి పట్టుదలగా ఉన్నారని వరుసగా నమోదు చేస్తున్న కేసుల్ని బట్టి అర్థం చేసుకోవచ్చని చెబుతున్నారు. బెయిల్ వస్తే ఏ మాత్రం ఆలోచించకుండా సుప్రీంకోర్టుకు వెళ్లిన వైనమే వారి ఆలోచన ధోరణిని తెలియచేస్తుందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సుప్రీంకోర్టులో చంద్రబాబుకు 17ఏ విషయంలో నిరాశ ఎదురయితే.. ఏ మాత్రం అవకాశం దొరికినా ఆయనను మరోసారి అరెస్టు చేసే అవకాశం ఉంది. అన్ని కేసుల్లో ఒకే సారి కాకుండా.. ఒక కేసు తర్వాత మరో కేసును తెర ముందుకు తెచ్చి బెయిల్ వచ్చే సమయంలో మరోసారి అరెస్టు చూపించే వ్యూహాలను అమలు చేయవచ్చున్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటి వరకూ జరిగిన పరిణామాలు చూస్తే దీన్నికొట్టి పారేయలేమని టీడీపీ వర్గాలు కూడా అంచనా వేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు హైకోర్టు బెయిల్ మంజూరు సమయంలో కీలక వ్యాఖ్యలు చేసింది. కేసులో కనీస ప్రాథమిక ఆధారాలను కూడా సీఐడీ చూపించలేకపోయిందని స్పష్టం చేసింది. ఆరోగ్య కారణాలతో ఇచ్చిన మధ్యంతర బెయిల్ సందర్భంగా పెట్టిన షరతులను 29వ వరకూ కొనసాగిస్తూ తర్వాత వాటినీ తొలగించారు. వీటిపై సీఐడీ సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ వేసింది. విచారణకు వచ్చినా బెయిల్ రద్దు చేయడం అనేది ఉండకకపోవచ్చని న్యాయనిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ కేసులో ప్రాథమిక సాక్ష్యాధారాలు కూడా లేవని హైకోర్టు తేల్చడమే కాకుండా అప్పటికే చంద్రబాబును 53 రోజుల పాటు జైల్లో ఉంచారు. ఈ కారణంగా బెయిల్ రద్దు చేయకపోవచ్చని చెబుతున్నారు. స్కిల్ కేసులో బెయిల్ వచ్చినంత మాత్రాన చంద్రబాబుకు పూర్తి స్థాయిలో రిలీఫ్ దొరికినట్లు కాదు. ఎందుకంటే ఆయనపై ఉన్నది ఆ ఒక్క కేసు కాదు. మొత్తం ఆరు కేసులు ఉన్నాయి. అందులో ఒక్క కేసులోనే బెయిల్ వచ్చింది. మిగిలిన అన్ని కేసుల్లో ముందస్తు బెయిల్ పిటిషన్లపై ఏమీ తేలడం లేదు. వరుసగా సీఐడీ విచారణ సందర్భంగా వాయిదాలు కోరుతూనే ఉంది. వాయిదాలు పడుతూనే ఉంది. ఒక్ వేళ అన్నింటిలోనూ రిలీఫ్ వచ్చినా.. మరి కొన్ని కేసులు పెట్టడానికి సీఐడీ రెడీగా ఉందని మీడియాలో ప్రచారం జరుగుతోంది. వైఎస్ఆర్‌సీపీ నేతలు కూడా అదే చెబుతున్నారు. అందుకే చంద్రబాబుకు రిలీఫ్ దక్కాలంటే.. సుప్రీంకోర్టులో ఆయన దాఖలు చేసిన 17ఏ సెక్షన్ వర్తింపుపై అనుకూల తీర్పురావాలి. ఆ తీర్పు అనుకూలంగా వస్తే చంద్రబాబు అతి పెద్ద రిలీఫ్ పొందుతారు. ఆయనపై నమోదు చేసిన కేసులన్నీ చెల్లకుండా పోతాయి. మళ్లీ కొత్తగా ఏదైనా కేసు నమోదు చేయాలంటే గవర్నర్ అనుమతి తీసుకోవాలి. అలా తీసుకోలాంటే.. సీఐడీ కేసు పెట్టేసినట్లుగా ఏదో ఒకటి చెప్పి కేసు పెట్టేయడం కాదు.. చంద్రబాబుకు ప్రమేయం ఉన్నట్లుగా ప్రాథమిక ఆధారాలు చూపించాలి. అది అసాధ్యం కాబట్టి 17ఏ సెక్షన్ వర్తింపుపై అనుకూల తీర్పురావడమే చంద్రబాబుకు కీలకమని చెబుతున్నారు.

## గ్రేటర్ ఓటరు నాడి ఎటువైపు కొట్టుకుంటోంది!



హైదరాబాద్, నవంబర్ 22 (సమ సమాజం): మినీ భారతా‌గా పిలిచే హైదరాబాద్‌లో వివిధ రాష్ట్రాలు, ల్లాల నుంచి వచ్చి స్థిరపడిన వారు లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరంతా ఇప్పుడు రాజధాని పరిధి లోని మెజార్టీ స్థానాల్లో అభ్యర్థుల భవితను నిర్ణయించనున్నారు. 29 నియోజకవర్గాల్లో సగానికి పైగా వాటిలో ఇతర ప్రాంతాల ఓటర్లే విజయావకాశాలపై ప్రభావం చూపించనున్నారు. అందుకే వారిని ప్రసన్నం చేసుకోవడానికి అభ్యర్థులు ఆయా ప్రాంతాల నుంచి నేతలను రప్పించి ఆ ఓటర్లతో మాట్లాడిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో వివిధ రాష్ట్రాల నుంచి పలు పార్టీల నేతలు ప్రత్యేకంగా హైదరాబాద్‌కు వస్తుండటం విశేషం. రాజధాని పరిధిలోని 29 నియోజకవర్గాల్లో సుమారు 42 లక్షల వరకు ఓటర్లు ఇతర రాష్ట్రాలు, తెలం గాణలోని పలు జిల్లాల నుంచి వచ్చి స్థిరపడిన వారు ఉన్నారని అంచనా. ఏపీ నుంచి వచ్చిన వారి లో అత్యధికంగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్‌తోపాటు మరి కొన్ని నియోజకవర్గాల్లో ఉన్నారు. సనత్‌నగర్ జెక్ కాలనీలో స్థిరపడిన వారిలో అధికంగా ఏపీ వారే. ఇతర కాలనీల్లోనూ వారే అధికం. ఈ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి భారాస, కాంగ్రెస్ అభ్యర్థు లు తలసాని శ్రీనివాస్ యాదవ్, కోట నీలిమ విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. జూబ్లీహిల్స్ పరిధిలో అధికంగా తమిళనాడుకు చెందిన వారు స్థిరపడ్డారు. వారి మద్దతు కూడగట్టేందుకు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రంగంలోకి దిగారు. ఇక్కడి తమిళులతో మంత్రి సమావేశమై బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డికే ఓటు వేయాలని అభ్యర్థించారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లిలో ఆయా సంఘాల తో మంత్రి కేటీఆర్ మాట్లాడి తమకు మద్దతివ్వాలని కోరారు. ల్బీనగర్ పరిధిలో తెలంగాణలోని వివి ధ జిల్లాలతోపాటు ఇతర రాష్ట్రాల వారు వేల సంఖ్యలో ఉన్నారు. ఇక్కడి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్య ర్థులు సుధీర్‌రెడ్డి, మధుయాస్కీ ఆయా ఓటర్ల మీదే దృష్టిసారించారు. మహేశ్వరంలో దాదాపు 70 వేల నుంచి లక్ష మంది వరకు బిహార్, రాజస్థాన్, యూపీ, ఇతర ప్రాంతాల ఓటర్లు ఉన్నారు. వీరు ఎ టువైపు మొగ్గుచూపితే వారికే విజయం లభించే అవకాశం ఉంది. దీంతో అభ్యర్థులు సబితా ఇంద్రా రెడ్డి, కేఎల్ఆర్, అందె శ్రీరాములు వీరితో మాట్లాడుతున్నారు. ఆయా పార్టీలకు చెందిన ఇతర రాష్ట్రాల నేతలను రప్పించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో భాజపా ప్రచారం చేపట్టనుంది.

# దిక్కుతోచని స్థితిలో వైసిపి



టిడిపి భవిష్యత్ గ్యారెంటీతో అయోమయం

వైసిపికి బుద్ది చెప్పేందుకు ప్రలు సిద్ధం

టిడిపి అధ్యక్షుడు అచ్చన్నాయుడు వెల్లడి

అమరావతి,నవంబర్ 22 (సమ సమాజం): దెబ్బమీద దెబ్బతో వైసీపీ దిక్కుతోచని స్థితిలో ఉందని ఏపీ టీడీపీ అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ..టీడీపీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంతో వైసీపీ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. టీడీపీ అధినేత చంద్ర బాబును అక్రమంగా అరెస్ట్‌చేశారని,అయినా ఒక్కఆరోపణ నిరూపించలేకపోయారన్నా రు. ఈనెల 29 తరువాత చంద్రబాబు ప్రచారంలోకి వస్తారని, దీంతో వైసీపీకి గడ్డుకాలం తప్పదన్నారు. రోజూ స్వచ్ఛందంగా లక్షలాది మంది భవిష్యత్ గ్యారెంటీ రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని అన్నారు. చంద్రబాబుకు బెయిల్ మంజూరు కావడంపై జగన్ రెడ్డి, వైసీపీ గ్యాంగ్ అసహనంలో ఉన్నారని పేర్కొన్నారు.సహనంతో ఏం మాట్లాడుతున్నారో తెలియని స్థితికి బులుగు బ్యాచ్ చేరిందని అచ్చెన్నాయుడు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. గడపగడప ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్లిన వైసీపీ నేతలను ప్రజలు తరిమి తరిమి కొట్టారని అన్నారు. టీడీపీ భవిష్యత్తుకు గ్యారెంటీకి ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారని, ఆ అసహనంతో జగన్ ముఠా పిచ్చిపట్టినట్లు వ్యవహరిస్తోందని ఆయన మండిపడ్డారు. భవిష్యత్తులో అందించే పథకాల గురించి చెబుతుంటే ఎందుకంత అసహనం అని వైసీపీ నేతలను ఆయన ప్రశ్నించారు.ఆడబిడ్డకు నెలకు రూ.1500 ఇస్తామంటే వైసీపీకి ఎందుకంత కోపమని ప్రశ్నించారు. చదువుకునే ప్రతి బిడ్డకు రూ.15వేలు ఇస్తామంటే ఎందుకంత అసహనమని, ఏటా 3 సిలిండర్ల హామీపై ఎందుకంత కడుపు మంట అని అన్నారు. అన్నదాతకు రూ.20 వేలు ఇస్తామంటే ఎందుకంత అక్కసు అంటూ విరుచుకుపడ్డారు. బీసీలకు రక్షణ చట్టం తెస్తామంటే బరితెగింపు మాటలేల అని అన్నారు. ఇంకెన్నాళ్లీ తప్పుడు ప్రచారాలతో కాలం నెట్టుకొస్తారని ప్రశ్నిస్తూ.. జగన్ రెడ్డిలా ప్రజల వ్యక్తిగత డేటా టీడీపీ సేకరించడం లేదని తెలిపారు. వాలంటీర్లతో వివాహేతర సంబంధాల గురించి ఆరా తీసిందెవరని నిలదీశారు. సమాచారాన్నంతా రామ్ ఇన్ఫోటెక్ కంపెనీకి దోచిపెట్టిందెవరని అడిగారు. 2024 ఎన్నికల తర్వాత వైసీపీని బంగాళాఖాతంలో కలిపేయడం తథ్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. వైసీపీ ప్రభుత్వ రాక్షస పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ నేత పిలుపునిచ్చారు. వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే జరిగే నష్టాలను ప్రజలు గుర్తించారని అన్నారు. రైతులను ఆదుకోకుండా తన అసమర్థతను ఇతరులపై నెట్టడం దారుణమన్నారు. దీనికి ప్రజలు గమనించాలని సూచించారు. 2024లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ అక్రమాలపై నిగ్గు తేలుస్తామని అన్నారు.

# విశాఖలో స్కూల్ ఆటోను ఢీకొన్న లారీ

8మంది విద్యార్థులకు తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలించి చికిత్స



విశాఖపట్టణం,నవంబర్ 22 (సమ సమాజం): విశాఖలో బుధవారం ఉదయాన్నే ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జిల్లాలోని సంఘం శరత్ థియేటర్ సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది విద్యార్థులు గాయపడ్డారు. స్కూల్ ఆటోను లారీ ఢీకొట్టడటంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్న ఎనిమిది మంది విద్యార్థులకు గాయాలయ్యాయి. వారిలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. గాయపడిన విద్యార్థులు బేతని స్కూలుకు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. లారీ డ్రైవర్, క్లీనర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. స్కూల్ పిల్లలతో వెళ్తున్న ఆటోను లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో 8 మంది పిల్లలు గాయపడ్డారు. గాయపడ్డ విద్యార్థులను స్థానికంగా ఉండే సెవెన్ హిల్స్ ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి లారీ డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ప్రమాదం దృశ్యాలు చాలా హృదయవిదారకంగా ఉన్నాయి. చిన్నారుల రక్తమోడుతూ రోడ్డుపై పడి ఉండటాన్ని చూసిన వారి కళ్లు చెమర్చాయి. బేతని స్కూల్ విద్యార్థులు ఈ ఉదయం ఆటోలో స్కూల్ వెళ్తున్న సమయంలో ప్రమాదం జరిగింది. సంఘం శరత్ థియేటర్ సమీపంలో స్కూల్ పిల్లలు ప్రయాణిస్తున్న ఆటోను వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. అంతే అటో పల్టీలు కొట్టింది. ఈ దెబ్బకు అటోలో ఉన్న విద్యార్థులు రోడ్డుపై పడిపోయారు. ఆటో నుజ్జు నుజ్జు అయిపోయింది. ఆ ప్రమాదాన్ని చూసిన వారంతా ఘోరం జరిగిపోయిందని అనుకున్నారు. మెరుపు వేగంతో స్పందించిన స్థానికులు ఆటోను లేపి పిల్లలకు సపర్యలు చేశారు. పిల్లలు బోరున ఏడుస్తూ రక్తం కారుతున్న గాయాలతో రోడ్డుపై పడి ఉండటం చూసిన వారి హృదాయాలు చలించిపోయాయి. అటు నుంచి వెళ్తున్న ప్రతి ఒక్కరు ఎవరికి తోచిన విధంగా వారు పిల్లలకు సాయం చేశారు. స్కూల్ విద్యార్థులతో వెళ్తున్న ఆటోను ఢీ కొట్టిన తర్వాత లారీ డ్రైవర్, క్లీనర్ పారిపోయేందుకు యత్నించారు. వారి స్థానికులు, ఆటో డ్రైవర్‌లు పట్టుకొని బంధించారు. పోలీసులు వచ్చే వరకు అక్కడే ఉంచి వారికి అప్పగించారు. ప్రమాదం విషయాన్ని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు పరుగుపరుగున కొందరు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మరికొందరు ఆసుపత్రికి చేరుకున్నారు. రక్తపు గాయాలతో పడి ఉన్న తమ చిన్నారులను చూసుకొని కన్నీరు మున్నీరుగా విలపించారు. మధురవాడ, నగరం పాలెం రోడ్డులో కూడా ఓ స్కూల్ ఆటో బోల్తా పడింది. ప్రమాదం జరిగిన టైంలో ఆటోలో ఏడుగురు విద్యార్థులు ఉన్నారు. పంది అడ్డం రావడంతో దాన్ని తప్పించే క్రమంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ఎంపి ఆదాలతో బిఎల్వోల భేటీ

కోటంరెడ్డికి వ్యతిరేకంగా చర్చ

నెల్లూరు,నవంబర్ 22 (సమ సమాజం): రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిపై వైసీపీ పెద్దలు భారీ కుట్రకు యత్నిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో కోటంరెడ్డిని ఓడించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. నగరంలోని ఓ కళ్యాణమండపంలో బీఎల్వోలు, వైసీపీ నేతలతో ఎంపీ ఆదాల రహస్య సమావేశం నిర్వహించారు. మీడియా ప్రతినిధులు రాకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### యూపీ తరహాలో తెలంగాణలోనూ

# బీఎస్పీని ఆదరించాలి

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలి

బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి




హైదరాబాద్,నవంబర్ 22 (సమ సమాజం): ఉత్తర్?ప్రదేశ్ తరహాలో తెలంగాణలోనూ బీఎప్పీని ఆదరించాలని ఆ పార్టీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి రాష్ట్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. సూర్యాపేటలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొన్న మాయవతి.. బీఎస్పీని గెలిపించి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లకు సూచించారు. రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి ఇంకా వారం రోజులే గడువు ఉండడంతో.. రాజకీయ పార్టీలన్ని ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ప్రతి నాయకుడు ఇంటి ఇంటికి వెళ్లి ఓట్లు వేయాలని అభ్యర్థిస్తున్నారు. జాతీయ పార్టీ నాయకులు రాష్ట్రంలో ఎన్నికల ప్రచారంలో మునిగిపోయారు. బీఎప్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి సూర్యాపేటలో నిర్వహించిన ఆ పార్టీ బహిరంగ సభలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్? మాదిరి తెలంగాణలో కూడా బహుజన సమాజ్ పార్టీని ఆదరించాలని మాయావతి కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలు ప్రకటించినా.. వాటిని అమలు చేయట్లేదని విమర్శించారు. అంబేద్కర్, కాన్షీరామ్ కలలను మనం సాకారం చేయాలని గుర్తు చేశారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఐపీఎస్‌ను వదిలి.. ప్రజల సేవ కోసం వచ్చారని తెలిపారు. పార్టీని గెలిపించి.. ఆయనను ముఖ్యమంత్రిని చేయాలని సూచించారు. బీఎస్పీని దక్షిణాదిలోనూ విస్తరించేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు వినూత్న తీర్పు ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు.

# కోవిడ్ వ్యాక్సిన్‌తో ఆకస్మిక మరణాల ముప్పు పెరగదు




న్యూఢిల్లీ, నవంబర్ 22 (సమ సమాజం): కొవిడ్–19 వ్యాక్సిన్ యువతలో ఆకస్మిక మరణాల ముప్పును పెంచదని భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అధ్యయనం వెల్లడించింది. కనీసం ఒక డోసు వ్యాక్సిన్ తీసుకున్నా.. ఆకస్మిక మరణం ముప్పు తగ్గుతుందని తేల్చింది. దీనికి సంబంధిం చిన నివేదిక ఇండియన్ జర్నల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్‌లో ప్రచురితమైంది. యువతలో ఆకస్మిక మరణాలకు గల కారణాలను విశ్లేషించేందుకు అక్టోబరు 1, 2021 నుంచి మార్చి 31, 2023 మధ్య కాలం లో ఐసీఎంఆర్ ఒక అధ్యయనాన్ని చేపట్టింది. దీని కోసం ఆకస్మికంగా మరణించిన 18–45 ఏళ్ల వయసు వ్యక్తుల కేసులను అధ్యయనం చేసింది. ఇందులో భాగంగా 729 కేసులు, 2,916 కంట్రోల్ కేసులకు సంబంధించిన సమాచారాన్ని సేకరించింది. ఈ అధ్యయనంలో రెండు డోసుల వ్యాక్సిన్ తీసుకున్న వారిలో ఆకస్మిక మరణాల ముప్పు తక్కువగా ఉందని తెలిపింది. కనీసం ఒక డోసు వ్యా క్సిన్ తీసుకున్నా.. ఈ ముప్పు తగ్గుతుందని నివేదికలో పేర్కొంది. ఈ ఆకస్మిక మరణాలకు ధూమ పానం, తీవ్ర శ్రమ, మరణించడానికి 48 గంటల ముందు మద్యం సేవించడం, మత్తు పదార్థాల విని యోగం వంటి వాటితోపాటు, కొవిడ్ చికిత్స తర్వాత జీవనశైలిలో మార్పులు, ఆహారపు అల వాట్లు వంటివి కూడా కారణాల కావచ్చని తెలిపింది.

# ఈశాన్య రుతుపవనాల ప్రభావం

### కేరళ,తమిళనాడుకు భారీ వర్షసూచన



చెన్నై, నవంబర్ 22 (సమ సమాజం): ఈశాన్య రుతుపవనాల ప్రభావంతో కేరళ, తమిళనాడు రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రెండు రోజుల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఎనిటతిజీ ఓ.బి.నీసస్గీ÷నీణతిఇఞజీ ఆ÷ఔజీసబిప.నిబి) తాజాగా వెల్లడించింది. ఈ మేరకు హెచ్చరికలు చేసింది. రెండు రాష్ట్రాలకు ఆరెంజ్ అలర్ట్ (క్షసజీనిణ. జ్గీ÷సబి) జారీ చేసింది. ఈ రెండు రాష్ట్రాలతోపాటు కోస్తా ఆంధ్రప్రదేశ్, రాయలసీమ, యానాంలోని కొన్ని ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. గురువారంకేరళలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ (ఎఓఆ) అంచనా వేసింది. ఇక తమిళనాడు, పుదుచ్చేరిలో నేడు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరించింది. వాతావరణ విభాగం హెచ్చరికలతో కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. ముందు జాగ్రత్తగా పాఠశాలలకు సెలవు ప్రకటించాయి. మరోవైపు తమిళనాడులోని 10 జిల్లాల్లో రానున్న రెండు రోజుల్లో అడపాదడపా వర్షాలు కురుస్తాయని చెన్నైలోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం అంచనా వేసింది. బుధవారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. భారీ వర్షాల కారణంగా పుదుచ్చేరి, కారైకల్‌లోని పాఠశాలలకు అధికారులు సెలవు ప్రకటించారు. మరోవైపు కేరళలో ఇప్పటికే గణనీయమైన వర్షపాతం నమోదైనట్లు ఐఎండీ వెల్లడించింది. పతనంతిట్ట, తిరువనంతపురం జిల్లాల్లో వరుసగా 7 సెంటీమీటర్లు, 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వెల్లడించింది.

# వేముల సమక్షంలో పలువురు చేరిక

### బిఆర్ఎస్‌తోనే సంక్షేమం అన్న మంత్రి



నిజామాబాద్, నవంబర్ 22 (సమ సమాజం): సీఎం కేసిఆర్ జనరంజక పాలన, బాల్కొండ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, బాల్కొండ నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పలు కుల సంఘాలు, యువజన సంఘాలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎన్నికల్లో మంత్రి వేములకు సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారు.ందులో భాగంగా? వేల్పూర్ మండల కేంద్రానికి చేసిన కేసీఆర్ కాలనీ, వెంకటాపూర్ యాదవ సంఘం సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. అభివృద్ధి ప్రదాత వేముల ప్రశాంత్ రెడ్డికే మా ఓటు అంటూ ముక్త కంఠంతో నినదించారు. అందుకు సంబంధించిన తీర్మాన పత్రాలు మంత్రికి అందజేశారు. తనకు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేయడం పట్ల మంత్రి వేముల వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

# జనసేన–బీజేపీ అభ్యర్థులను గెలిపించండి

### బీసీని ముఖ్యమంత్రిగా చేస్తాం

తెలంగాణలో అవినీతి పెరిగిపోవడం బాధ కలిగించింది

దశాబ్ద కాలం తరవాత తెలంగాణలో పోటీకి దిగుతున్నా

జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్



హైదరాబాద్,నవంబర్ 22 (సమ సమాజం): బలిదానాల పైన ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో అవినీతి పెరిగిపోవడం బాధ కలిగించిందని.. అందుకే దశాబ్ద కాలం తరవాత తెలంగాణలో పోటీకి దిగుతున్నానని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీతో కలిసి శాసనసభ ఎన్నికల పోరుకు సంసిద్ధమైనట్లు తెలిపారు. ప్రచారంలో భాగంగా వరంగల్?లో ఏర్పాటు చేసిన సకల జనుల విజయ సంకల్ప సభలో పవన్ పాల్గొని.. పార్టీ తరఫున నియోజకవర్గ అభ్యర్థులకు మద్దతుగా నిలిచారు. రాష్ట్రంలో బీసీ ముఖ్యమంత్రిని చూడాలంటే.. జనసేన–బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బలిదానాల పైన ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం అవినీతిమయం కావడం బాధ కలిగించిందని.. అందుకే దశాబ్ద కాలం తరవాత తెలంగాణలో పోటీకి దిగుతున్నానని జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీతో కలిసి శాసనసభ ఎన్నికల పోరుకు సంసిద్ధమైనట్లు తెలిపారు. జనసేన అభ్యర్థులతో పాటు కూటమిలో ఉన్న బీజేపీ అభ్యర్థుల తరఫున కూడా ప్రచారం చేసేందుకు ఆయన ఇవాళ ఓరుగల్లు చేరుకున్నారు. ఎన్నికల ప్రచార షెడ్యూల్?లో భాగంగా.. హనుమకొండలో ఆ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన సకల జనుల విజయ సంకల్ప సభలో పవన్ పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రాలో రౌడీలు రాజ్యమేలుతున్నారని.. గుండాల పాలన నడుస్తోందని.. అలాంటి పరిస్థితుల్లోనూ తట్టుకుని నిలబడుతున్నానంటే.. దానికి వరంగల్ పోరాటస్ఫూర్తే కారణమని పవన్ అన్నారు. తన పోరాటానికి తెలంగాణ యువత అండగా నిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. ఆంధ్రాలో ఎలా తిరుగుతున్నానో.. అదేవిధంగా వచ్చే ఏడాది నుంచి తెలంగాణలోనూ తిరుగుతానని తెలిపారు. ఏ మార్పు కోసం తెలంగాణ బిడ్డలు చనిపోయారో అది సాధిస్తామని.. తెలంగాణ ఇచ్చిన స్ఫూర్తితోనే పదేళ్లుగా పార్టీ నడుపుతున్నానని పవన్ పేర్కొన్నారు. తెలంగాణలో నేను అధికారం చూడట్లే.. మార్పు చూస్తున్నాను. యువత, బీసీల తాలుకా సాధికారత చూస్తున్నాను. బీసీలు ముఖ్యమంత్రిగా కూర్చోవాలని ఆశిస్తున్నవారిలో నేనూ ఒకడిని. దానికోసం నా ప్రయత్నం తప్ప ఇక్కడేదో కూర్చోవాలని కాదు. తెలంగాణ బలిదానాలపై వచ్చిన రాష్ట్రం.. ఇప్పుడు ఇంత అవినీతి పాలవుతుందని నేనెప్పుడు ఊహించలేదు. కొందరు అవినీతిని లెక్కల్లో ధైర్యంగా బయట చెప్తుంటే చాలా బాధగా ఉంది. అదే పోరాట తెలంగాణ యువత బలంగా ఉంటే టీవీల్లో వాళ్లు మాట్లాడడాటికి కూడా భయపడాలని అన్నారు. ఆంధ్రా జన్మనిస్తే.. తెలంగాణ పునర్జన్మనిచ్చింది : పరోక్షంగా అధికారం పార్టీపై విమర్శలు చేసిన జనసేనాని.. తెలంగాణలో దళిత ముఖ్యమంత్రిని చూడలేకపోయామన్నారు. బీసీ ముఖ్యమంత్రినైనా చూడాలని బీజేపీతో కలిసినట్లు వివరించారు. తనకు ఆంధ్రా జన్మనిస్తే.. తెలంగాణ పునర్జన్మ ఇచ్చిందని పేర్కొన్నారు. నాడు తెలంగాణకు మద్దతు ఇచ్చిన వారిలో తానూ ఒకడినని ఉద్ఘాటించారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితోనే జనసేన స్థాపించామని.. 2009లో స్థాపించిన పార్టీ ఎన్నో ఆటుపోట్లను తట్టుకుని నిలబడటానికి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే కారణమన్నారు. రాష్ట్రంలో కమీషన్ల రాజ్యం నడుస్తోందన్న పవన్.. తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నుంచి తెలంగాణలోనూ పర్యటిస్తానని.. కమలం గుర్తుకు ఓటు వేసి.. రావు పద్మ, ఎర్రబెల్లి ప్రదీప్‌ను గెలిపించాలి అని ఓటర్లకు పవన్ కల్యాణ్ విజ్ఞప్తి చేశారు.

# ఒకే కుటుంబంలో 150 మందికి ఆరు వేళ్లు



పానీపట్, నవంబర్ 22 (సమ సమాజం): హర్యానా రాష్ట్రంలోని పానీపట్ జిల్లా బాబర్‌పుర్‌కు చెందిన జానీ కుటుంబంలోని 150 మంది కాళ్లు లేదా చేతులకు ఆరేసి వేళ్లు కలిగి ప్రత్యేకత సంతరించుకున్నా రు. ఇలా కాళ్లు లేదా చేతులకు ఆరేసి వేళ్లు ఉండడం వల్ల తమకు ఎలాంటి సమస్య అనిపించదని జానీ పేర్కొన్నాడు. అయితే చెప్పులు, షూస్ వేసుకునే సమయంలో కాస్త ఇబ్బందిగా అనిపిస్తుం దని అన్నాడు. తన కుటుంబంలో కొంత మంది బాబర్‌పుర్‌లో.. మరికొందరు పానీపత్ పక్కనే ఉన్న నోహ్రా గ్రామంలో నివసిస్తున్నారని వివరించాడు. ఒకే కుటుంబంలో చాలా మంది ఆరు వేళ్లతో పుట్టడాన్ని వైద్య పరిభాషలో పాలీడాక్టిలీ అంటారని వైద్యాధికారి డాక్టర్ జైన్‌శ్రీ తెలిపారు.

# కెసిఆర్‌ను ఓడించేందుకు ప్రజలే నిర్ణయించారు

### అధికార పార్టీకి ఓటమి తప్పదన్న తుమ్మల



ఖమ్మం,నవంబర్ 22 (సమ సమాజం): ఖమ్మంలో అరాచకంపై బటన్ నొక్కి తీర్పు ఇవ్వాలని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కెసిఆర్ అవినీతి, అహంకార పూరిత పాలన పోవాలని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారని, అందుఉకే కాంగ్రెస్‌ను గెలిపించాలని నిర్ణయించుకున్నారని అన్నారు. తుమ్మలకు మద్దతుగా కురవి మండలం బలపాల గ్రామస్తులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో ఎప్పుడూ బలపాల గ్రామస్థులు అండగా ఉన్నారన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ తనకూ.. రేణుకా చౌదరికి రాజకీయ జన్మ ఇచ్చారన్నారు. ఎన్టీఆర్ తనను మొదటి సారే వెంగళరావు కుటుంబంపై నిలబెట్టారన్నారు. నలభై ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నానంటే ప్రజాభిమానం కారణంగానేనని తుమ్మల పేర్కొన్నారు. వామపక్ష యోధులు ఉన్న జిల్లాలో గౌరవంగా రాజకీయాలు చేశానన్నారు. తన రాజకీయ లక్ష్యం గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాని సస్య శ్యామలం చేయడమేనన్నారు. అరాచక శక్తులు రాజ్యమేలుతుంటే అలాగే ఉండాలా? అని ప్రశ్నించారు. ఖమ్మం ఎన్నికపై కోట్లలో బెట్టింగ్‌లు సాగుతున్నాయని తుమ్మల పేర్కొన్నారు. సాధించుకున్న తెలంగాణాలో కేసీఆర్ ప్రజల సొమ్ము దోచుకుంటున్నారని ఆరోపించారు. దొరని గడీలోనే బంధించి శాశ్వతంగా రాజకీయ సమాధి చేయాలన్నారు. ఇందిరమ్మ రాజ్యం వచ్చిన మొదటి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నాణ్యమైన సన్నబియ్యం ఇస్తామన్నారు. కేసీఆర్ దోపిడీని రోజూ ప్రశ్నిస్తున్నామని రేవంత్ రెడ్డిని, తనను ఓడించడానికి డబ్బుల సంచులు పంపిస్తున్నారని మండిపడ్డారు. మీరందరూ హస్తం గుర్తుకు ఓటేసి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను గెలిపించండని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిషరిస్తామన్నారు. డిసెంబర్ తొమ్మిదిన కాంగ్రెస్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని.. రాబోయేది ఇందిరమ్మ రాజ్యం అంటూ ధీమా వ్యక్తం చేశారు.

# హాలీవుడ్ సినీ ఫక్కీలో నౌకపై హెలికాప్టర్ దాడి



టోక్యో, నవంబర్ 22 (సమ సమాజం): ఎర్ర సముద్రంలో సరకు రవాణా నౌక గెలాక్సీ లీడర్‌ను హెలికా ప్టర్‌తో వెంబడించి హౌతీ రెబల్స్ స్వాధీనం చేసుకున్న వీడియో దృశ్యాలు హాలీవుడ్ సినిమాల్లోని యాక్షన్ సీన్లకు ఏ మాత్రం తీసిపోని విధంగా ఉన్నాయి. దీనికి సంబంధించిన వీడియోను తిరుగుబా టుదారులు విడుదల చేశారు. గాజాపై యుద్ధాన్ని ఆపేంత వరకు ఇజ్రాయెల్‌పై సముద్ర దాడులు చేస్తామంటూ మరోసారి హెచ్చరించారు. నౌకను విడిపించేందుకు సంప్రదింపులు జరుపుతున్నట్లు జపాన్ వెల్లడించింది. తిరుగుబాటుదారులు హెలికాప్టర్‌లో ఎర్ర సముద్రంపై ఉన్న నౌక దగ్గరకు చేరుకున్నారు. షిప్‌పై ఎవరూ లేని సమయంలో డెక్‌పై హెలికాప్టర్ ల్యాండ్ అయింది. అందులోం చి దిగిన హౌతీ రెబల్స్ నినాదాలు చేస్తూ, కాల్పులు జరుపుతూ పరుగెత్తి.. వీల్‌హౌస్, కంట్రోల్ సెంటర్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. తర్వాత నౌకను యెమెన్‌లోని సలీఫ్ పోర్టుకు మళ్లిం చారు. ఓడపై దాడి కేవలం ఆరంభం మాత్రమేననీ.. గాజాపై యుద్ధాన్ని ఆపేంత వరకు ఇజ్రాయెల్ పై సముద్ర దాడులు చేస్తామని హౌతీ అధికార ప్రతినిధి తెలిపారు. నౌక తుర్కియే నుంచి భారత్‌కు వస్తున్న సమయంలో హైజాక్ జరిగింది. అందులోని 25 మంది సిబ్బందిని హౌతీ రెబల్స్ బందీలు గా తీసుకున్నారు. హౌతీలు గెలాక్సీ లీడర్ నౌకను స్వాధీనం చేసుకోవడంపై ఐక్యరాజ్య సమితి సెక్రె టరీ జనరల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఖండించారు. ఇది ఇలావుంటే, ఆ నౌక తమది కాదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ నౌక యజమాని బ్రిటన్ వాసి కాగా, జపాన్‌కు చెంది న ఎన్‌వైకే లైన్ అనే సంస్థ దీనిని నిర్వహిస్తున్నట్లు తెలిసింది. దీంతో జపాన్ ప్రభుత్వం రంగంలోకి దిగి తిరుగుబాటుదారులతో నేరుగా సంప్రదింపులు జరుపుతోంది. నౌకను విడుదల చేయించేందుకు కృషి చేయాలని ఇరాన్, సౌదీ అరేబియా, ఒమన్ దేశాలకు విజ్ఞప్తి చేసింది.

## జగన్ బెయిల్ రద్దుపై 24న సుప్రీంలో విచారణ



న్యూఢిల్లీ,నవంబర్ 22 (సమ సమాజం): ఏపీ సీఎం జగన్ బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరగనుంది. శుక్రవారం జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టనుంది. కాగా జగన్ బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో వైసీపీ రెబల్ ఎంపీ రఘురామ కృష్ణంరాజు పిటిషన్ దాఖలు చేశారు. అక్రమాస్తుల కేసులో గత పదేళ్లుగా జగన్ బెయిల్‌పై ఉన్నారని, ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ మేరకు తెలంగాణ హైకోర్టులో ఎంపీ రఘురామ పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ ఇచ్చిన రిప్లై ఆధారంగా జగన్ బెయిల్ రద్దు పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో హైకోర్టు తీర్పును రఘురామ సుప్రీంలో సవాలు చేశారు.

# బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు రైతుల పాలిట శత్రువులు



(మొదటి పేజి తరువాయి) నివేదికను ఇప్పటికే అమలు చేయలేదని ఆయన విమర్శించారు. సిద్దిపేటలో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ సర్కారు మోటార్లకు మీటర్లు పెట్టాలని తెలంగాణ ప్రభుత్వంపై ఒత్తిడి చేసిందని, మీటర్లు పెట్టకపోతే రాష్ట్రానికి రావాల్సిన నిధులకు కోత పెడుతామని బెదిరించిందని, అయినా గూడా మోటార్లకు మీటర్లు పెట్టేది లేదని సీఎం కేసీఆర్ తెగేసి చెప్పారని మంత్రి వివరించారు. దేశంలో మోటార్లకు మీటర్లు పెట్టని ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని చెప్పారు. మోటార్లకు మీటర్లు పెట్టనందుకు గత ఐదేళ్లలో రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో రూ.25 వేల కోట్ల నష్టం చేసిన బీజేపీకి ఓట్లడిగే అర్హతే లేదని అన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టమని బీజేపీ సర్కారు ఒత్తిడి చేసిందని మేము చెబుతుంటే.. లేదు లేదు తమ ప్రభుత్వం ఆ మాటే అనలేదని తెలంగాణ బీజేపీ నేతలు అదరగొట్టింద్రని చెప్పారు. మంగళవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలతో నిజమేదో అబద్ధమేదో తేలిపోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా మోటార్లకు మీటర్లు పెడుతున్నయని చెప్పి నిర్మలా సీతారామన్ పుణ్యం కట్టుకున్నారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రైతుల పక్షపాతి అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రాల్లో కూడా మోటార్లకు మీటర్లు పెట్టారని, ఒకవేళ కాంగ్రెస్ గెలిచినా రాష్ట్రంలో రైతుల మోటార్లకు మీటర్లు పెడుతారని అన్నారు. పొరపాటున కూడా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటు వేయవద్దని చెప్పారు. మోటార్లకు మీటర్ల విషయమై కేంద్రం నుంచి వచ్చే రూ.25 వేల కోట్ల నిధులు ముఖ్యమా.. రాష్ట్రంలోని 69 లక్షల మంది రైతుల ప్రయోజనాలు ముఖ్యమా..అనే ప్రశ్న తలెత్తినప్పుడు సీఎం కేసీఆర్ రైతుల పక్షాననే నిలిచారని మంత్రి హరీశ్‌రావు చెప్పారు. మోటార్లకు మీటర్లు పెట్టి రైతులకు 24 గంటల ఉచిత కరెంటు లేకుండా చేయాలనేది బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుట్ర అని మంత్రి విమర్శించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓటేస్తే 24 ఉచిత కరెంటు ఎత్తేస్తరని తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందేనని మంత్రి ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతున్నదని చెప్పారు. కేసీఆర్ సీఎం అయిన నాడు తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104 ఉంటే, ఇప్పుడు తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,17,117కు చేరింది. బీజేపీ ప్రభుత్వం 100 నెలల్లో 100 లక్షల కోట్ల అప్పుచేసిందని మండిపడ్డారు. నెలకు రూ. లక్ష కోట్ల చొప్పున కేంద్రం అప్పులు తెచ్చిందన్నారు. అయినా బీజేపీ గురివింద రీతిన మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మోటర్లకు మీటర్లు పెట్టకపోవడం వల్లనే అదనపు డబ్బులు రాలేదని కేంద్రమంత్రి నిర్మల సీతారామన్ కుండ బద్దలు కొట్టారని, ఇంత కాలం బీజేపీ నాయకులు అబద్దాలతో దబాయించారని మంత్రి హరీశ్ రావు అన్నారు. ఇప్పుడు తెలంగాణ బీజేపీ నాయకులు ఈ మొకం పెట్టుకుని ఒట్లు అడుగుతారని ప్రశ్నించారు. ఈ దేశంలో రైతు పక్ష పాతి ఒకే ఒక్కడు కేసీఅర్ అని, కాంగ్రెస్ బండారం కూడా నిర్మల సీతారామన్ బయట పెట్టారన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్టాల్లోనూ మీటర్లు పెట్టారని ఆమె చెప్పారన్నారు. ఇక్కడ కాంగ్రెస్ లేదా బీజేపీ సర్కారు ఉండి ఉంటే రైతుల మోటర్లకు మీటర్లు, రైతులకు బిల్లులు వచ్చేవని, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక వంటి కాంగ్రెస్ పాలిత రాష్టాల్లో మీటర్లు పెట్టి అదనపు డబ్బులు తెచ్చుకుంటున్నారని ఆరోపించారు. పొరపాటున తెలంగాణలో కాంగ్రెస్ వస్తే రైతులకు మీటర్లు తప్పవని హెచ్చరించారు. గెలిచిన కర్ణాటకలో 5 గంటలు మాత్రమే ఇస్తున్నట్లు డికె శివకుమార్ స్పష్టం చేశారని, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రైతులకు శత్రువులని హరీష్‌రావు అన్నారు.

# అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్



(మొదటి పేజి తరువాయి) ఆ పార్టీకి 11 ఛాన్స్‌లు ఇచ్చినా ఏం చేశారంటూ మండిపడ్డారు. టీపీసీసీ అధ్యక్షుడు మూడు గంటలు పొలాలకు కరెంట్ చాలని చెబుతున్నాడని.. మరి మూడు గంటలు కరెంట్ సరిపోతుందో.. లేదో చెప్పాల్సింది ప్రజలేనన్నారు. కరెంటు కావాలో.. కాంగ్రెస్ కావాలో తేల్చుకోవాలన్నారు. మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పింఛన్‌ను రూ.5వేలకు పెంచుతామన్నారు. సౌభాగ్యలక్ష్మి పథకం కింద 18ఏళ్లు నిండిన మహిళలకు రూ.3వేలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే అసైన్డ్ భూముల ఉన్న వారికి యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు చెప్పారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బీజేపీ సిద్ధాంతాలను కాంగ్రెస్‌లో అమలు చేస్తున్నారన్నారు. ప్రధాని నరేంద్ర మోదీని ఒక్కసారి సైతం విమర్శించలేదన్నారు. కాంగ్రెస్ హవా అనేది సామాజిక మాధ్యమాల్లో ప్రచారం మాత్రమేనంటూ సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ 80 సీట్లలో విజయం సాధించి అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. తొమ్మిదేళ్ల పాలనలో మైనారిటీలకు సీఎం కేసీఆర్ ప్రభుత్వం చాలా చేసిందని, వారి మద్దతు తమకే కుంటుందని పేర్కొన్నారు. రైతుబంధు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఈసీని రెండుసార్లు కోరామని కేసీఆర్ పేర్కొన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్‌కు లేని అడ్డంకి రైతుబంధుకు ఎందుకు అంటూ ప్రశ్నించారు.

# చరిత్ర సృష్టించే అవకాశం ఇక్కడి ప్రజలది




(మొదటి పేజి తరువాయి) చర్యకైనా సిద్ధం. కేసీఆర్‌కు పదేళ్లు అవకాశం ఇచ్చారు. ఇక్కడ పోడు భూముల సమస్య తీరలేదు. గిరిజనులను బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. నిజాం షుగర్ ఫ్యాక్టరీని 100 రోజుల్లో తీరుస్తానని పదేళ్లయినా తెరువలేదు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఇక్కడి రైతులు ఓడించారు. ఈ ప్రాంత రైతుల సమస్యలను బీఆర్ఎస్ నేతలు పట్టించుకోలేదు. బాజిరెడ్డి గోవర్ధన్ ఆర్టీసీ కార్మికులను నిర్లక్ష్యం చేసి వారి హక్కులను కాలరాశారు. అయ్య బక్కోడు.. కొడుకు తిరుగుబోతోడు. ప్రజలను ఆదుకోవాలంటే ఒక్కరూ ముందుకు రారు.ఎర్రజొన్న రైతులపై పెట్టిన కేసులు ఎత్తేయలేదు. పసుపు బోర్డు తెస్తానన్న గుండోడు ఎక్కడికో పోయిండు. నేను పాదయాత్ర చేసినప్పుడు ఈ ప్రాంత యువకులు నన్ను ఇక్కడి నుంచి పోటీ చేయమని అడిగారు. అధిష్ఠానం నన్ను కామారెడ్డిలో పోటీ చేయమని ఆదేశించింది‘ అని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎవరు గెలుస్తారో రాష్ట్ర ప్రభుత్వం అదే వస్తుంది. తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తెస్తాం. మేడిగడ్డ మూడేళ్లకే కుంగి పోయింది. మీరు కట్టిన ప్రాజెక్టులు చూపించి బీఆర్ఎస్ నేతలు ఓట్లు అడగాలి. మేము కట్టిన శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు చూపించి ఓట్లు అడుగుతాం. ఇందిరమ్మ రాజ్యం అంటే గరీబోళ్ల రాజ్యం. బీఆర్ఎస్ అంటే దొరల రాజ్యం, దొంగల రాజ్యం. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని కేసీఆర్ ఊహాలోకంలో ఉంచారు. ఆయన మాత్రం 150 రూముల బంగ్లా కట్టుకున్నాడు. బోధన్ ఏసీపీకి చెప్తున్నా.. నీ నౌకరి నువ్వు చెయి.. బీఆర్ఎస్ కార్యకర్తలాగా చేయకు.. డిసెంబర్ 3వ తేదీ తర్వాత ఏమైతదో చూడు కేసీఆర్‘ అని రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

# మానవసేవే మాధవ సేవగా నమ్మిన సత్యసాయి



(మొదటి పేజి తరువాయి) అమలయ్యేలా విద్యా వ్యవస్థలను రూపొందించారన్నారు. మానవతా విలువలు, ఆధ్యాత్మికత, శాస్త్ర సాంకేతిక అంశాలతో కూడిన సమ్మిళిత విద్యను బోధిస్తూ అత్యద్భుతమైన ఫలితాలతో ప్రపంచంలోనే మేటి విద్యాసంస్థల సరసన నిలిపారన్నారు. సత్యసాయి విద్యాసంస్థలు ఉత్తమ ప్రమాణాలతో కూడిన ఆదర్శ విద్యను అందిస్తున్నాయన్నారు. అందువల్లే సత్యసాయి విద్యాసంస్థలు విలువల నిలయాలుగా నిలచాయన్నారు. భగవాన్ సత్యసాయి బాబా ప్రజలకు వైద్య, విద్యా,మంచినీరు వంటి ఎన్నో సేవలు అందించారాన్నారు.భగవాన్ సత్యసాయిబాబా సేవలను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు వారి అడుగుజాడల్లో నడవాలని సూచించారు. గోల్డ్ మెడల్ సాధించిన, కాన్వకేషన్ పొందిన విద్యార్థులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారురాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ... బాబా సత్యసాయిబాబా 42 వ స్నాతకోత్సవం లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, ప్రేమ,సాధన వంటి వాటిని అలవర్చుకొని జీవితంలో అభివృద్ధి చెంది దేశానికి సేవలు అందించాలన్నారు శ్రీ సత్య సాయి బాబా విద్యాసంస్థల్లో నేటి ఆధునిక విద్యతోపాటు సమగ్ర సమైక్యతను నెలకొల్పే ప్రాచీన కాల గురుకుల విద్య వ్యవస్థను కూడా పాటిస్తూ విద్యార్థుల జీవితంలో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నారన్నారు. ప్రపంచమంతా వసుదైక కుటుంబమని ప్రతి ఒక్కరూ సేవా గుణం కలిగి జీవించాలని సూచించారు. అలాగే విద్యార్థులు అందరూ ధర్మం సత్యాన్ని పాటించి ధర్మో రక్షిత రక్షితః అనే సిద్ధాంతాన్ని పాటిస్తూ జీవితంలో ఉన్న స్థాయికి చేరాలని విద్యార్థులకు సూచించారు. అలాగే కాన్వకేషన్ పొందిన విద్యార్థులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.వివిధ రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన శ్రీసత్యసాయి బాబావిద్యాసంస్థల విద్యార్థులకు పట్టాలతో పాటు 21 మందికి బంగారు పతకాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు.కార్యక్రమానికి ముందు ట్రస్ట్ సభ్యులు ముఖ్య అతిథులను సన్మానించారు.వైస్ ఛాన్స్ లర్ ప్రొఫెసర్ బి రాఘవేంద్ర ప్రసాద్ కాన్వగేషన్ పొందిన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.అంతకుముందు భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము భారత వాయుసేన విమానంలో ఒడిశా నుంచి బుధవారం మధ్యాహ్నం సత్యసాయి విమానాశ్రయానికి ద్రౌపది ముర్ము చేరుకున్నారు.అనంతరం రాష్ట్రపతి సాయి కుల్వంత్ హాలు లో సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీ గోరంట్ల మాధవ , ఎమ్మెల్యేలు దుద్దుగుంట శ్రీధర్ రెడ్డి, తిప్పేస్వామి, జిల్లా కలెక్టర్ పి అరుణ్ బాబు, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు,వివిధ విద్యా సంస్థల అధికారులు, విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సత్యసాయి జిల్లాలో పర్యటించారు. ఢిల్లీ నుంచి పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న ద్రౌపది ముర్ము అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సత్యసాయి ఆశ్రమం వద్దకు వెళ్లారు. పుట్టపర్తికి చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర మంత్రి ఉష శ్రీ చరణ్, పుట్టపర్తి ట్రస్ట్ సభ్యులు రత్నాకర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్రపతి ప్రశాంతి నిలయానికి బయలుదేరారు. ప్రశాంతి నిలయంలో సత్యసాయి సమాధిని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దర్శించుకున్నారు. ఆ తర్వాత పుట్టపర్తిలో సాయిహీరా ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్‌కు రాష్ట్రపతి వెళ్లారు. సత్యసాయి డీమ్డ్ యూనివర్శిటీ 42వ స్నాతకోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 14 మందికి డాక్టరేట్లు, 21 మంది విద్యార్థులకు బంగారు పతకాలు అందజేశారు. ఈ స్నాతకోత్సవంలో ఆమె ప్రసంగించారు. అనంతరం రోడ్డు మార్గంలో సత్యసాయి విమానాశ్రయానికి చేరుకొని.. అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి వెళ్లిపోయారు.

# యూజీసీ -నెట్ సిలబస్‌కు సవరణలు



న్యూఢిల్లీ, నవంబర్ 22(సమ సమాజం): జాతీయ అర్హత పరీక్ష(నెట్) సిలబస్‌ను సవరించాలని యూనివ ర్సిటీ నిధుల సంఘం(యూజీసీ) నిర్ణయించింది. ఇందుకోసం నిపుణుల కమిటీ ఏర్పాటు చేస్తామని యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్ మంగళవారం తెలిపారు.కొత్త సిలబస్‌ను ప్రవేశపెట్టే ముందు అ భ్యర్థులకు ప్రిపరేషన్ కోసం తగినంత సమయం ఇస్తామని చెప్పారు. జూనియర్ రిసెర్చ్ ఫెలోషిప్ కోసం, అలాగే అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి అర్హత పరీక్షగా యూజీసీ-నెట్‌ను జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహిస్తుంది. ఏటా రెండుసార్లు ఈ పరీక్షను నిర్వహిస్తారు.

# కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు నెలలకో సీఎం



(మొదటి పేజి తరువాయి) పాల్గొంటారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్?రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో మోదీ మూడు రోజుల పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని అన్నారు. ఈ నెల 25, 26, 27 తేదీల్లో తుప్రాన్, నిర్మల్, కామారెడ్డి, మహేశ్వరం, కరీంనగర్, మహబూబ్ బాద్ జిల్లాల్లో నిర్వహించే బహిరంగ సభలకు రానున్నారని చెప్పారు. అనంతరం హైదరాబాద్?లో నిర్వహించే రోడ్? షో)కు హాజరవుతారని పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి కాంగ్రెస్, బీఆర్?ఎస్?లపై ధ్వజమెత్తారు. బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించే దమ్ము కాంగ్రెస్(కు ఉందా అని ప్రశ్నించారు. కేసీఆర్ తన కుమారుడు సీఎం అవుతాడని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటూ రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కారు రావాలని.. ప్రజలు బీజేపీకి అవకాశం ఇస్తారని భావిస్తున్నట్లు తెలిపారు. కేసీఆర్ కుటుంబానికి అబద్ధాలు చెప్పడం వెన్నతో పెట్టిన విద్యగా పేర్కొన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు ఎందుకు ఆలస్యమవుతుందో కేసీఆర్ చెప్పాలన్నారు. 2014 హామీకి కట్టుబడి బీఆర్ఎస్? అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తుందా అని ప్రశ్నించారు. ఒక మహిళా కేంద్రమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఘాటుగా విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీకి రోజు రోజుకు ప్రజల నుంచి ఆదరణ పెరుగుతోందని కిషన్?రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబ పాలనకు వ్యతిరేకంగా ప్రజలు ఏకమవుతున్నారన్నారు. బీసీ సంఘాలు కలిసి తమ పార్టీకు మద్దతు ఇస్తున్నాయని చెప్పారు. బీసీ వర్గాల ఆకాంక్షలకు విరుద్ధంగా బీఆర్?ఎస్? సర్కారు పని చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం కోసం పని చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అనేక రకాలుగా ఈ రాష్ట్రాన్ని దోచుకుందని మండిపడ్డారు. కర్ణాటక తరువాత తెలంగాణలో గెలుస్తామని కలలు కంటోందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజలు అవకాశం ఇవ్వరు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు నెలలకు ఒక ముఖ్యమంత్రి మారుతారు. బొగ్గు నుంచి హెలికాప్టర్ల వరకు కాంగ్రెస్ కుంభకోణాలకు పాల్పడింది. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారు రావాలి. రీజినల్ రింగ్ రోడ్డు ఎందుకు ఆలస్యం అవుతుంది కేసీఆర్ చెప్పాలి. మహిళా కేంద్ర మంత్రిని అనుచిత వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని అన్నారు.

# కాంగ్రెస్ పాలనలో తాండూరు అధ్వాన్నం

(మొదటి పేజి తరువాయి)తెలంగాణను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని ఆర్థికనిపుణులతో చర్చించి ఒక లైన్ తీసుకున్నాం.పేదల సంక్షేమాన్ని ముందు తీసుకున్నాం. రూ. 200 ఉన్న పెన్షన్‌ను రూ. 2 వేలు చేశాం. కంటి వెలుగు ద్వారా కండ్లద్దాలు పంపిణీ చేశారు. గర్భిణుల కోసం కేసీఆర్ కిట్, అమ్మ ఒడి వాహనాలు అందుబాటులోకి తెచ్చాం. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి కార్యక్రమాలు అమలు చేశాం అని కేసీఆర్ తెలిపారు. సంక్షేమం తర్వాత వ్యవసాయ రంగం తీసుకున్నాం. వ్యవసాయం బాగుంటే, రైతులు చల్లగా ఉంటే దేశం కూడా బాగుంటది. ప్రాజెక్టుల కింద నీళ్లు పారుతే ఇతర రాష్టాల్లో పన్నులు వసూళ్లు చేస్తరు. మేం నీటి తిరువా రద్దు చేశాం. మేలైన విద్యుత్ 24 గంటలు ఫ్రీ ఇస్తున్నాం. రైతుబంధును పుట్టించిందే కేసీఆర్. అదృష్టం బాగాలేక రైతు ఎవరైనా చనిపోతే దినవారం లోపే 5 లక్షల బీమా ఇస్తున్నాం. 7500కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొంటున్నాం. ప్రభుత్వానికి నష్టం వచ్చినప్పటికీ రైతులు బాగుండాలని మద్ధతు ధరకు కొంటున్నాం. ఆ డబ్బులు కూడా మీ బ్యాంకు ఖాతాలో వేస్తున్నామని కేసీఆర్ గుర్తు చేశారు. కర్ణాటక ప్రజలు, రైతులు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే.. ఐదు గంటల కరెంటే ఇస్తున్నారు.. తెలంగాణలో కూడా కాంగ్రెస్‌కు ఓటేస్తే మన గతి కూడా అంతే అయితది అని సీఎం కేసీఆర్ హెచ్చరించారు. తాండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని, పైలట్ రోహిత్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. రైతుబంధు తప్పకుండా ఉంటది.. ఉండుడే కాదు. రేపు రోహిత్ రెడ్డి గెలిస్తే 10 వేలనుంచి 16 వేలకు పోతది. రోహిత్ గెలిస్తేనే ఉంటది. కత్తి ఒకరికి ఇచ్చియుద్ధం ఇంకొకరిని చేయమంటే ధర్మం కాదు కదా..? రైతుల పక్షాన, ప్రజల పక్షాన ఉండే వారి చేతిలో కత్తి పెడితేనే వాళ్లు మిమ్మల్ని కాపాడుతారు. 24 గంటల కరెంట్ ఉంటది రోహిత్ రెడ్డి గెలిస్తేనే లేదంటే కరెంట్ ఆగమైపోతది. కాబట్టి మీరు రోహిత్‌కు ఓటేయాలన్నారు. ఇంకో డేంజర్ మాట చెబుతున్నారు కాంగ్రెసోళ్లు. వీఆర్వోల రాజ్యం, ప్రభుత్వం చేతిలో రైతుల బతుకు ఉండే. ఇప్పుడు మీ బొటనవేలు పెడితేనే భూ యజమాన్యం మారుతది. ముఖ్యమంత్రికి కూడా ఆ అధికారం లేదు. ప్రభుత్వం మీకు ధారపోసిన ఆ అధికారాన్ని పొడగొట్టు కుంటారా..? కాపాడుకుంటారా..? అనేది మీరే నిర్ణయించుకోవాలి అని కేసీఆర్ సూచించారు. కాంగ్రెసోళ్లు చెప్తున్నారు అధికారంలోకి వస్తే అది వచ్చేది లేదు సచ్చేది లేదు కానీ ధరణిని బంగాళాఖాతంలో వేస్తరట. భూమత పెడుతరట. అది భూమాతనా..? భూ మేతనా..? ధరణి తీసేస్తే రైతుబంధు డబ్బులు ఎలా రావాలి. ఇది తీవ్రమైన సమస్య. రైతాంగానికి జీవన్మరణ సమస్య. కాబట్టి మీరంతా సీరియస్‌గా ఆలోచించాలి. మేం పాత పద్ధతి పెడుతామని చెప్తున్నారు. మళ్లీ పట్వారీలు, పాత కథనే వస్తది. మళ్లీ దళారి రాజ్యమే వస్తది. కాంగ్రెస్ అంటేనే దళారీ, పైరవీకారుల రాజ్యం. మన భూములు మనకు కాకుండా చేసే కుట్ర జరుగుతుంది. చాలా కష్టపడి ధరణి తెచ్చాం. కరెంట్ తెచ్చాం. అవన్నీ కూడా తీసేస్తాం అంటున్నారు. కాబట్టి ఆలోచించి ఓటు వేయాలని కేసీఆర్ కోరారు. తాండూరు బీఆర్ఎస్ అభ్యర్థి పైలట్ రోహిత్ రెడ్డి నిజాయితీపరుడు.. ఆయన కోరిన కోరికలన్నీ తప్పకుండా నెరవేర్చి, ఈ నియోజక వర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. తాండూరు నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని, పైలట్ రోహిత్ రెడ్డికి మద్దతుగా ప్రసంగించారు. జినుగుర్తిలో ఇండస్ట్రియల్ పార్కు కావాలని, లారీలు పట్టణంలో ఎక్కడంటే నిలబడుతున్నాయని చెప్పారు. మహేందర్ రెడ్డికి ధన్యవాదాలు.. ఈసారి రోహిత్ రెడ్డికి టికెట్ ఇద్దామంటే ఆయన కూడా పెద్ద మనసు చేసుకుని అంగీకరించారు. ఆయన ఆశీస్సులు కూడా మనకు ఉన్నాయి. రోహిత్ రెడ్డి నిజాయితీకి నిలబడ్డ మనిషి. బీజేపీ వాళ్లు వచ్చి మన ప్రభుత్వాన్ని కూలగొట్టాలని కుట్ర చేస్తే వాళ్లను పట్టించి జైల్లో వేయించారు. బ్రహ్మాండమైన పని చేసిండు. నిజాయితీకి నిలబడ్డాడు. ఆయన అడిగింది ఏది కాదనకుండా మంజూరు చేస్తున్నాను. ఆయన వ్యక్తిగతంగా ఏది అడగలేదు. తాండూరు వెనుకబడ్డ ప్రాంతం. బోర్డర్‌లో ఉండే ప్రాంతం. నాకు బాగా తెలుసు. తప్పకుండా పాలిటెక్నిక్ కాలేజీతో పాటు మిగతావి కూడా ఇచ్చేద్దాం. తప్పకుండా మంజూరు చేస్తాను అవేమీ గొంతెమ్మ కోరికలు కావు. ఢిల్లీ నుంచి తెచ్చేటివి కావు. హైదరాబాద్‌లో చేసే పని కాబట్టి నూటికి నూరు శాతం నెరవేరుస్తాను అని కేసీఆర్ హామీ ఇచ్చారు.తండాల్లో లంబాడీ బిడ్డలే రాజ్యమేలుతున్నారు.. బంజారా బిడ్డలు మా తండాలో మా రాజ్యం కావాలని ఏండ్లు కొట్లాడారు. ఏ గవర్నమెంట్ చేయలేదు. ఈ కాంగ్రెసోళ్లు కేర్ చేయలేదు. మేం 3,500 తండాలను గ్రామపంచాయతీలుగా చేశాం. తాండూరులో 24 గ్రామ పంచాయతీలుగా చేశాం. లంబాడీ బిడ్డలే సర్పంచ్‌లుగా ఉండి రాజ్యమేలుతున్నారు. సేవాలాల్ సేన వాళ్లు మద్దతు ప్రకటించారు. వాళ్లకు ధన్యవాదాలు. సేవాలాల్ జయంతి ఘనంగా జరుపుతున్నాం. రాబోయే రోజుల్లో మరింత ఘనంగా జరుపుకుందాం. బంజారాహిల్స్‌లో బంజారాలు లేకుండా పోయారు సమైక్య రాష్ట్రంలో. మన ప్రభుత్వం వచ్చిన తర్వాత బ్రహ్మాండంగా బంజారా భవన్ కట్టాం. మన రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బంజారా భవన్‌ను ఎయిర్ కండీషన్ సదుపాయంతో కట్టాం. బంజారాల గౌరవానికి చిహ్నంగా దాన్ని నిర్మించామని కేసీఆర్ తెలిపారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, *Editor: GOSUKONDA PRUDHVIRAJU*,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in